నవతెలంగాణ
ఉమ్మడి ఆదిలాబాద్
బుధవారం | జనవరి 3, 2024 | www.navatelangana.com

## పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదు

- సోషల్ మీడియా వార్తలు నమ్మకండి : కిరణ్‌కుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి ఇబ్బందీ లేదని, పట్టణ, ఇతర పెట్రోల్ బంక్‌లలో సరిపడేంత నిల్వలు ఉన్నాయని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మవద్దని, పెట్రోల్ బంక్‌లలో నిలబడి సమయం వృథా చేసుకోవద్దని సూచించారు. మన జిల్లాకు రోజు వారీగా రావాల్సిన ఆయిల్ ట్యాంకర్లు యథావిధిగా వస్తున్నాయని తెలిపారు. దీనిపై వివిధ ఆయిల్ కంపెనీలకు చెందిన సేల్స్ ఆఫీసర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు.

## నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జడ్జి

నవతెలంగాణ-లక్సెట్టిపేట



నవతెలంగాణ దినపత్రిక 2024 నూతన క్యాలెండర్‌ను లక్సెట్టిపేట మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ అసదుల్ల షరీఫ్ ఆవిష్కరించారు. మంగళవారం కోర్టు ఆవరణలో జడ్జిని మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిజేసిన అనంతరం జడ్జి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ నేటి సమాజంలో పత్రికల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

## 8న సీపీఐ(ఎం) జిల్లా ప్లీనరీని జయప్రదం చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

జనవరి 8న నిర్వహించే సీపీఐ(ఎం) జిల్లా ప్లీనరీ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మారుతున్న రాజకీయ పరిస్థితులను నిరంతరం అధ్యయనం చేస్తూ, ప్రజలకు ఇంకా మెరుగైన జీవితం కోసం ప్రజలను అంటిపెట్టుకొని వారికి నేర్పుతూ, నేర్చుకుంటూ ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ప్రస్తుత రాజకీయాల నేపథ్యంలో కార్మికవర్గ రాజ్య స్థాపనకు ఒక్కొక్క అడుగు ముందుకు పడే విధంగా జాగ్రత్త పడుతూ కార్యకర్తలకు సూచించారు. అందులో భాగంగానే జిల్లా ప్లీనరీ సమావేశాలు జనవరి 8న జిల్లా కేంద్రం కార్యాలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య హాజరవుతున్నారని తెలిపారు. సమావేశాలకు మేధావులు, ఉద్యోగులు ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు, పార్టీ సభ్యులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేష్, పట్టణ కమిటీ సభ్యులు డి.పోశెట్టి, నాయకులు చందు, సాయికిరణ్, గంగారాం పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే హరీష్‌కు అయోధ్య అక్షింతలు



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

అయోధ్య నుండి తీసుకొచ్చిన రాముల వారి అక్షింతలను ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబుకు మంగళవారం ఆయన నివాసంలో విశ్వ హిందు పరిషత్ జాతీయ జాయింట్ సెక్రటరీ స్థాను మలయన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదిరెడ్డి అందజేశారు. వీహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ 15 రోజులపాటు ప్రతి ఇంటికి ఈ అక్షింతలను పంపిణీ చేయడం జరుగుతుందని, అయోధ్యలో రాముల వారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ప్రజలందరూ ఆస్వాదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి అరుణ్‌కుమార్ లోయ, భజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షులు శివగౌడ్, రంగ స్వామి, శుభం లోయ, వలపదాసు ప్రణయ్ పాల్గొన్నారు.

**చింతలమానేపల్లి :** మండలంలోని బాబాసాగర్ గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఎమ్మెల్యేగా మొదటిసారి రావడంతో గ్రామస్తులు, మహిళలు, యువకులు, నాయకులు భాజా భజంత్రీలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం గ్రామ హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అయోధ్య రాముల అక్షింతలను పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మండల అధ్యక్షులు రామగొని తిరుపతిగౌడ్, మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, నాయకులు సత్పుతే తుకారం, పవన్, మోహన్ పాల్గొన్నారు.

**కౌటాల :** అయోధ్య శ్రీరాముని అక్షింతల శోభాయాత్ర మంగళవారం మండలంలోని తలోడి గ్రామ హనుమాన్ ఆలయం నుండి సాయిబాబా ఆలయం వరకు భారీ ఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. అయోధ్య నుండి వచ్చిన పూజిత అక్షింతలను ఇంటింటికి అందజేయనున్నట్టు మండల శ్రీరామ కమిటీ సభ్యులు తెలిపారు.

## ఆరు గ్యారంటీ పథకాలపై కళాకారులతో అవగాహన

నవతెలంగాణ-మందమర్రి

రాష్ట్ర ప్రభుత్వ ఆరు గ్యారంటీ పథకాలపై జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో ఆటా పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజా పాలన ద్వారా అభయ హస్తం పథకాలకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కళారూపాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సారథి కళాకారులు లావుడ్యా రమేష్, ముల్కల్ల మురళి, మామిళ్ల లచ్చన్న, పోశం, రవీందర్, శ్రీనివాస్, కిష్టయ్య, రాజా తిరుపతి పాల్గొన్నారు.

## నేటి పార్లమెంట్ సన్నాహక సమావేశానికి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



**ఆదిలాబాద్అర్బన్ :** హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించనున్న ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ నేతృత్వంలో పార్టీ కార్యకర్తలు సమావేశానికి బయలుదేరారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేయనున్నారని ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విజ్జగిరి నారాయణ, దాసరి రమేష్, సలీం పాల్గొన్నారు.

# నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి, అందరికీ చదువు, ఉపాధి కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ అన్నారు. జాతీయ స్థాయి మెడికల్ ఎంట్రన్స్ టెస్ట్ నీట్‌ను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో జనవరి 12న దేశవ్యాప్తంగా 16 విద్యార్థి సంఘాలను కలుపుకొని చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. పసి వయస్సులోనే విద్యార్థుల పాఠ్య పుస్తకాల్లో మతోన్మాద భావజాలాన్ని జొప్పిస్తూ విద్యారంగాన్ని కాషాయీకరిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల పాఠ్యపుస్తకాల్లో జాతీయ ఉద్యమ నాయకుల చరిత్రను తొలగించి, జాతీయోద్యమంతో సంబంధం లేని హెగ్డేవార్, సావర్కర్ చరిత్రను పొందుపరుస్తున్నారని, జ్యోతిష్యం, వాస్తు వంటి అశాస్త్రీయ భావజాలాన్ని విద్యార్థుల మెదళ్లలోకి ఎక్కిస్తూ మొద్దు బారుస్తున్నారని అన్నారు. ఎన్‌టిఎ వంటి సంస్థలను రద్దు చేయాలని, జాతీయ స్థాయి పోటీ పరీక్షలను ఈ సంస్థ ద్వారా నిర్వహించడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దేశంలోని కేంద్ర విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కనీస నిధులు కేటాయించడం లేదని, నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా బడా, బహుళ జాతి కంపెనీల ప్రైవేటు యూనివర్సిటీలను ఆహ్వానిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను నీరుగార్చే కుట్ర చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పెండింగ్ ఉన్న రూ.7800 కోట్ల పెండింగ్ స్కాలర్షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు డైట్ బిల్లులు సకాలంలో ఇవ్వాలని, రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలకు సరిపడా నిధులు కేటాయించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వం విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. గత ప్రభుత్వం మాదిరిగానే నియంతృత్వ పోకడలకు పోతే విద్యార్థులు సరైన రీతిలో స్పందించి తీరుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సక్కు, ఆత్రం నగేష్, నాయకులు జుగాదిరావు, సాగర్, రాము, రమేష్, నవీన్, పట్నాయక్, సుధాకర్, సిద్ధు, ఆకాశ్, యాదవ్ పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ - కౌటాల

ఆర్థిక అక్షరాస్యతపై తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం తుమ్మిహేటి, గుండాయిపేట్ గ్రామాల్లో మేనేజర్ నరసింహస్వామి అవగాహన కల్పించారు. ఖాతాదారులందరు తమ ఖాతాలకు ఫోన్ నెంబర్లను అనుసంధానం చేసుకోవాలన్నారు. అనుసంధానంతో ఖాతాల్లో జరిగే లావాదేవీలు ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలుసుకోవచ్చని సూచించారు. మోసాలు జరిగే అవకాశముండదన్నారు. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన పథకాల్లో చేరడం వల్ల భవిష్యత్తులో ఖాతాదారుడు మరణిస్తే కుటుంబానికి ఆర్థికంగా ఆసరా కల్పించిన వారవుతారన్నారు. అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 సంవత్సరాలు నిండిన తర్వాత భార్యాభర్తలు ఇద్దరు బతికున్నంత కాలం నెలకు రూ.5వేల చొప్పున ప్రతినెల పెన్షన్ వారి ఖాతాలో జమవుతుందన్నారు. భార్యాభర్తలు ఇద్దరు మరణించిన తర్వాత వారసులకు రూ.8.75లక్షలు కేంద్ర ప్రభుత్వం ద్వారా చెల్లించబడుతుందని సూచించారు. ఇటువంటి సామాజిక భద్రత పథకాలను అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్‌బీఐ జనరల్ పథకం ద్వారా 65 సంవత్సరాలలోపు వారు ప్రతి సంవత్సరం రూ.వెయ్యి కట్టినట్టయితే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలన్నీ ప్రతినెల ఈఎంఐలు సక్రమంగా కట్టాలని, రైతులు సంవత్సరంలోపు వ్యవసాయ రుణాలను తిరిగి చెల్లిస్తే తక్కువ వడ్డీ పడుతుందన్నారు. ఎంపీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ ద్వారా కళాజాత సభ్యులు రాఘవేంద్ర ప్రదర్శన ద్వారా ఖాతాదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చరందాస్, కార్యదర్శి సందీప్, సీఎస్‌పీ ప్రకాష్, మహిళా సంఘాల సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

## పీఆర్‌టీయూటీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-దండేపల్లి

పీఆర్‌టీయు టిఎస్ 2024 క్యాలెండర్‌ను సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అప్పాల మనోహర్, మండల అధ్యక్ష కార్యదర్శులు రావనవెని రవి, మల్యాల మల్లేష్ మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలు కనీసం 2024 సంవత్సరంలోనైనా పరిష్కరించేలా చూడాలన్నారు. అన్నీ ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించి విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. భాషా పండితులు, పిఈటి పోస్టులకు పదోన్నతులు చేపట్టాలని, ఎన్నో ఏళ్లుగా పదోన్నతులు, బదిలీలు లేక ఇబ్బంది పడుతున్న ఆదర్శ పాఠశాల, కేజీబీవీలలో బదిలీలు పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు వరలక్ష్మి, శ్రీనివాస్, సురేందర్, శ్రీనివాస్, కాంతారావు, కిషన్, మల్లయ్య, రాజమౌళి, రిటైర్డ్ ఉపాధ్యాయులు అన్నం సత్యానారాయణ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్‌లో పెరిగిన రద్దీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్రం తెచ్చిన కొత్త చట్టంపై నిరసన తెలుపుతూ ఆయిల్ ట్యాంకర్స్ ట్రక్ డ్రైవర్లు సోమవారం నుండి సమ్మె ప్రారంభించిన నేపథ్యంలో మంగళవారం కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ నిండుకుంది. అందుబాటులో ఉన్న జిల్లా కేంద్రంలోని పలు పెట్రోల్ బంకులు వాహనదారులతో కిటకిటలాడాయి. మంగళవారం మధ్యాహ్నం ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మె విరమించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం రాత్రి వరకు బంకులలోకి పెట్రోల్, డీజిల్ వచ్చే అవకాశాలు ఉన్నట్లు యజమానులు తెలిపారు.

## ప్రతి ఒక్క దరఖాస్తు స్వీకరించాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ నాయక్



నవతెలంగాణ-దండేపల్లి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్క దరఖాస్తును స్వీకరించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ నాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని వెలగనూరు గ్రామంలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అర్హులైన వాళ్లందరిని ఎంపిక చేసి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అరు గ్యారంటీ పథకాలను పారదర్శకంగా అమలయ్యేలా చూస్తామన్నారు. దరఖాస్తులను తిరస్కరించడానికి వీలు లేదన్నారు. కేంద్రానికి వచ్చిన మహిళలతో దరఖాస్తుల పంపిణీ, నమోదు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన ప్రజలకు కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## ఐటీ టవర్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



నవతెలంగాణ-ఆదిలాబాద్అర్బన్

ద్వితీయ శ్రేణి నగరాలకు సైతం ఐటీ సేవలను విస్తరింపజేయాలన్న ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆదిలాబాద్ పట్టణానికి నలభై కోట్ల వ్యయతో ఐటీ టవర్‌ను మంజూరు చేసిందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మంగళవారం నిర్మాణంలో ఉన్న ఐటీ టవర్‌ను ఆయన పరిశీలించారు. టవర్ నిర్మాణ పనులను పర్యవేక్షించి సంబంధిత అధికారులతో చర్చించారు. ఐటీ టవర్ నమూనాను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఐటీ టవర్ నిర్మాణం పూర్తయితే ప్రత్యక్షంగా వెయ్యి మందికి, పరోక్షంగా రెండు వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఇప్పటికే ఆదిలాబాద్‌లో ఐటీ సేవలు ప్రారంభం కావడంతో అనేక మంది యువతకు ఉపాధి లభించిందని తెలిపారు. నిర్మాణంలో ఉన్న టవర్‌కు ఎటువంటి అడ్డంకులు లేకుండా పనులు పూర్తి చేయాలని, ఈ విషయంపై ఎమ్మెల్యే దృష్టి సారించాలని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆదిలాబాద్‌కు జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, వ్యవసాయ కళాశాల మంజూరైన విషయాన్ని గుర్తు చేశారు. అభివృద్ధికి తమ వంతుగా పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పవన్ నాయక్, నాయకులు కలీం, సునీల్, మహేష్, చందర్ పాల్గొన్నారు.

## అధికారులను కలిసిన టీఎన్జీవోస్ సభ్యులు



**ఆదిలాబాద్‌టౌన్ :** నూతన సంవత్సరం పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పి ఉదయ్ కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవీని వేరువేరుగా వారి కార్యాలయాల్లో జిల్లా టీఎన్జీవోస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.అశోక్, నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

## పత్రికలే ప్రభుత్వానికి ప్రజలకు వారధి



నవతెలంగాణ-కెరమెరి

పత్రికలే ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధని ఎంపీడీవో మహేందర్, ఎంపీపీ పెందూర్ మోతీరాం అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీతో కలిసి 2024 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికలు ముఖ్య భూమిక పోషించాలన్నారు. పత్రికలు ప్రజలకు ఉపయోగపడేలా, ప్రజా సమస్యలను బహిర్గతం చేయాలని పేర్కొన్నారు. సమాజంలోని మంచీ చెడులను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడానికి పత్రికలు ప్రధాన పాత్ర వహిస్తాయన్నారు. ఒక వర్గానికి మాత్రమే అనుకూలంగా ఉండేలా పత్రికలు పనిచేయకూడదన్నారు. నేటి ఆధునిక యుగంలో పత్రికలు సమాజంలోని మార్పునకు కృషి చేయాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చేసే మంచీ చెడులను ప్రజలకు తెలియజేయడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. జర్నలిజం అనేది మంచి విలువలతో కూడుకున్నదని, ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర వెలకట్ట లేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం మండల అధ్యక్షుడు కావిడే తులసీరాం, సెండే నారాయణ్, గిరిజన సంఘం నాయకుల సిడాం ధర్మ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతిఒక్క కుటుంబం దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-తాంసి

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీల పథకం పొందేందుకు అర్హులైన ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ లక్ష్మి తెలిపారు. ఐదు గ్యారంటీల పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని గోట్కూరు, కప్పర్ల గ్రామాలతో పాటు భీంపూర్ మండలంలోని నిపాని, కరంజి గ్రామాలలో ప్రజాపాలన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లతో కలిసి ఎంపీడీవో భూమయ్య, శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మి పాల్గొని లబ్ధిదారుల నుండి దరఖాస్తులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ఐదు గ్యారంటీల పథకం లబ్ది పొందేందుకు ప్రతి గ్రామ పంచాయతీలలో ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పథకంలో లబ్ది పొందేందుకు దరఖాస్తు ఫారంలో పొందపరచిన 5 గ్యారంటీల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్దిదారులు ఎటువంటి అపోహలకు పోకుండా మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా దరఖాస్తు ఫారాలను గ్రామ సభలో తీసుకువచ్చి అధికారులకు ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ నెల ఆరవ తేదీ వరకు ఈ గ్రామ సభలు కొనసాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు సదానందం, సాత్విక నరేందర్ యాదవ్, రాజన్న, ఎంపీటీసీ సంతోష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ పాలకవర్గం



నవతెలంగాణ-ఖానాపూర్

హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో మంగళవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను ఖానాపూర్ మున్సిపల్ పాలకవర్గం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణ అభివృద్ధితో పాటు మొత్తం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దామనే లక్ష్యంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చనని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం, కౌన్సిలర్లు, నాయకులు కిషోర్ నాయక్, కుర్మా శ్రీనివాస్, కావలి సంతోష్, అమనుల్లాఖాన్, షబ్బీర్ పాషా, పర్మి సురేష్, జన్నారపు శంకర్, కంటం రవి పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నూతన సంవత్సరం పురస్కరించుకొని యువజన కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలెక్టర్ రాహుల్ రాజ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్‌గౌడ్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ మాజీ జిల్లా అధ్యక్షుడు చారి ఉన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | జనవరి 03, 2024 | www.navatelangana.com

## ఐటీ టవర్ నిర్మాణ పనుల పరిశీలన

**నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్**

ఐటీ టవర్ నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ పరిశీలించారు. రూ.40 కోట్లతో కొనసాగుతున్న ఐటీ టవర్ నిర్మాణ పనులను స్థానిక కౌన్సిలర్ పవన్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉన్నత విద్యతో పాటు ఉన్నతమైన కొలువులకు పునాదులు వేసిన జోగు రామన్న చేసిన కృషిని కొనియాడారు. స్థానికంగా ఉన్న రాజకీయ నాయకులు అభివృద్ధి కార్యక్రమాలు మరింత ముందుకు సాగేలా చొరవ చూపాలని పేర్కొన్నారు.



## టీఎస్‌టీటీఎఫ్ క్యాలెండర్ విడుదల

**నవతెలంగాణ-ఉట్నూర్**

ఐటీడీఏపీఓ చాహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా టీఎస్‌టీటీఎఫ్ క్యాలెండర్‌ను మంగళవారం విడుదల చేశారు. టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్ నాయక్ జిల్లా అధ్యక్షులు పవర్ లక్ష్మణ్‌లు పుష్పగుచ్ఛాన్ని అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్ నాయక్ మాట్లాడుతూ గిరిజన విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు మధుసూదన్, హేమంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## రైతులు యాసంగి పంటకు సిద్ధం కావాలి



**నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్**

సదర్‌మాట్ ఆయకట్టు రైతులు యాసంగి పంటకు సిద్ధం కావాలని, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్ తెలిపారు. మంగళవారం స్థానిక విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 4న ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సదర్‌మాట్ నీటి విడుదల కోసం రానున్నారని తెలిపారు. పొలాల్లో ఉన్న ఖరీఫ్ పంటకు సంబంధించిన ధాన్యం, వరిగడ్డిని ఇండ్లలోకి తెచ్చుకొని రైతులు రెండో పంటకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. నీటి విడుదలకు ఆయకట్టు పరిధిలోని రైతులందరూ రావాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నిమ్మల రమేష్, అబ్దుల్ మజీద్, జంగిలి శంకర్, కడార్ల గంగ నర్సయ్య, తోట సత్యం, రాజూ నాయక్, నబీఖాన్, సలీంఖాన్, మైస శ్రీనివాస్, అడ్వాల శంకర్, శ్రీను పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన కౌన్సిలర్లు

**నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్**

ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిన్నం సత్యం, కౌన్సిలర్లు కిషోర్ నాయక్, కుర్మ శ్రీను, కావలి సంతోష్, నాయకులు హమానుల్లాఖాన్, పరిమి సురేష్, జన్నారపు శంకర్, షబ్బీర్ పాషా, కాటం రవి ఉన్నారు.

## ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు

**నవతెలంగాణ-కడెం**

మండలంలో బెల్లాల్ మీదుగా జగిత్యాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్ అన్నారు. మంగళవారం మాజీ మండల అధ్యక్షులు గొల్ల వెంకటేష్ మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి జగిత్యాల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్సీ అతి త్వరలోనే కడెం నుంచి వయా బెల్లాల్, బోర్నపెల్లి మీదుగా జగిత్యాల బస్సు సౌకర్యం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు పడిగెల భూషణ్, బండి రమేష్, వెంకటేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

**నవతెలంగాణ-ఉట్నూర్**

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి మంగళవారం స్పెషల్ ఆఫీసర్ తిరుమల గ్రామపంచాయతి ఈఓ శంకర్‌లు కలిసి ప్రారంభించారు. దీనితో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉట్నూర్ గ్రామపంచాయతి తో పాటు ఆయా గ్రామ పంచాయతీలో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించి ధరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాల కోసం గ్రామ పంచాయతీలో ధరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ప్రజలు గ్రామపంచాయతిలో అందిస్తున్న ఉచిత ఫారాలను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవ్, రాజు, మనోహర్, గ్రామపంచాయతి సిబ్బంది, కార్యదర్శులు ఉన్నారు.

## 4న సదర్‌మాట్ నీటి విడుదల

**నవతెలంగాణ-ఖానాపూర్**

యాసంగి పంట కోసం సదర్‌మాట్ నీటిని 4న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేపట్టనున్నట్టు కాంగ్రెస్ మండల అధ్యక్షులు దయానంద్ తెలిపారు. మంగళవారం స్థానిక విశ్రాంతిభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులు ముందు జాగ్రత్తగా గడ్డిని తొలగించి, యాసంగి పంటకు ఏర్పాటు చేసుకోవాలని, నీటి విడుదలకు రైతులందరూ రావాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మండల కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ మజీద్, ఎంపీటీసీ సభ్యులు జంగిలి శంకర్, మేడంపెల్లి సర్పంచ్ రాజు నాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కడార్ల గంగ నర్సయ్య, మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు సలీంఖాన్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సచిన్, దిలావర్‌పూర్ గ్రామ అధ్యక్షులు నబిఖాన్, నాయకులు మిర్జా బేక్, శ్రీపాద శేషాద్రి, ఆసిఫ్, కొండ నారాయణ, రాజేశ్వర్, అశోక్, మైస శ్రీనివాస్, రమేష్, అడ్వాల శంకర్, శ్రీను పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం నిధులు సద్వినియోగం చేసుకోవాలి

**నవతెలంగాణ-లక్ష్మణచాంద**

కేంద్ర ప్రభుత్వం నిధులను సద్వినియోగం చేసుకొని గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగించాలని ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024 ప్రణాళిక గురించి గ్రామ సభ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ముత్యంరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టుకోవాల్సిన అభివృద్ధి పనులు గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వం పల్లెలకు అందిస్తున్న సహకారంతో లక్ష్మణచాంద గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముత్యంరెడ్డి, ఏఓ ప్రమీల,ఉప సర్పంచ్ శ్రీనివాస్,టి ఏ దినేష్,వార్డ్ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అయోధ్య పూజిత అక్షంతల వితరణ

**నవతెలంగాణ-కుభీర్**

మండలంలోని పార్డి(బి) గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరుని ఆలయంలో మంగళవారం అక్షంతల వితరణ కార్యక్రమం చేపట్టి ముందుగా వాటికి ఆలయ పూజారి జంగం దత్తత్రి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయోధ్య నుంచి వచ్చిన అక్షంతలకు పల్లకిలో ఉంచి గ్రామంలో ఉన్న ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. దీంతో పాటు గ్రామంలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల విద్యార్థులు శ్రీరాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడి వేషాలు వేసి నాటికలు ప్రదర్శించారు. దీంతో అయోధ్య నుంచి వచ్చిన అక్షంతలను గ్రామంలో ఉన్న ప్రతి ఇంటి ఇంటికి వితరణ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ అయోధ్య నుంచి వచ్చిన అక్షంతల ఎంతో పవిత్రమైనవి అన్నారు. వాటిని జాగ్రత్తగా ఉంచుకొనెలా చూడాలన్నారు. అదే విధంగా ఈనెల 22న అయోధ్యలో జరిగే బాల రాముల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, హిందు వాహిని సభ్యులు పాల్గొన్నారు.

# రచ్చకెక్కిన వీడీసీ వ్యవహారం

- మున్సిపల్ వ్యవహారంలో జోక్యంపై విమర్శలు
- పోట పోటీగా పోలీసులకు ఫిర్యాదు



**నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్**

గతంలో ఎన్నడూ లేని విధంగా ఖానాపూర్ పట్టణంలో వీడీసీ రచ్చకెక్కడం విమర్శలకు దారి తీస్తోంది. వీడీసీ పెద్దలుగా చెప్పుకుంటున్న పలువురు వ్యక్తులు మున్సిపల్ పాలనా వ్యవహారంలో తలదూర్చడాన్ని కౌన్సిలర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీడీసీ తీరును ఎండగడుతూ నాలుగు రోజుల క్రితం మున్సిపల్ ఫ్లోర్ లీడం చిన్నం సత్యం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీడీసీ సభ్యులు సైతం సోమవారం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సత్యంపై ఖానాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 6 నెలల క్రితం మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ ఖలీల్‌పై మెజార్టీ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు ఇచ్చారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా అవిశ్వాస తీర్మాణం విషయంలో చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ ఖలీల్ నోరు మెదపడం లేదు. చైర్మెన్, వైస్ చైర్మెన్‌కు లేని అత్యుత్సాహం వీడీసీ సభ్యులు ప్రదర్శించడం పలు అనుమానాలకు తావిస్తోంది. మున్సిపల్ పాలక సభ్యులు తీసుకున్న అవిశ్వాస నిర్ణయంపై చైర్మెన్, వైస్ చైర్మెన్ స్పందించాలే గాని అనవసరంగా వీడీసీ సభ్యులు కలుగజేసుకోవడం దుమారం రేపుతోంది. గతంలో ఖానాపూర్, తిమ్మాపూర్ పేరుతో గ్రామాభివృద్ధి కమిటీలు పనిచేసేవి. అప్పట్లో సదరు ప్రాంతాల్లో ఏదైనా సమస్య ఎదురైతే అందరికి ఆమోదయోగ్యంగా వీడీసీ పెద్దలు అక్కడికక్కడే పరిష్కరించేవారు. పట్టణ విస్తీర్ణం, జనాభా పెరిగిన దృష్ట్యా ఖానాపూర్, తిమ్మాపూర్ పరిధిలో ఎన్నో కొత్త కాలనీలు ఏర్పాటైనాయి. ప్రజల్లో చైతన్యం పెరిగింది. పంచాయతీగా ఉన్న ఖానాపూర్ మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత వీడీసీ ప్రాధాన్యత పూర్తిగా తగ్గిపోయింది. అయినా కొందరు తమ ఉనికికోసం వీడీసీ పేరుతో కొనసాగుతున్నారు. వారు అలా కొనసాగడం పట్ల ఎలాంటి అభ్యంతరం లేకపోయినా వీడీసీ పేరుతో సమస్యను సృష్టించి పాలనా వ్యవహారాల్లో కలుగజేసుకోవడాన్ని పలువురు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అనవసరమైన ఈ వివాదానికి కొందరు వీడీసీ సభ్యులు దూరం ఉన్నారు. ఓనాయకుడు తన స్వయం లబ్ధి కోసం ఆడుతున్న క్రీడలో పావులుగా మారిన పలువురు వీడీసీ సభ్యులు తప్పుచేశామన్న భావనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక నుండైనా ప్రజల ఆమోదం లేని విషయాల్లో వీడీసీ తలదూర్చడం మానుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**క్యాంపులో కౌన్సిలర్లు ..**

ఈనెల 5న మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ ఖలీల్‌పై అవిశ్వాస బల నిరూపణ ఉన్న నేపథ్యంలో కౌన్సిలర్లు క్యాంపులో ఉన్నారు. ఖానాపూర్ మున్సిపల్‌లో 12 మంది సభ్యులుండగా, 9 మంది మెజార్టీ కౌన్సిలర్లు చైర్మెన్, వైస్ చైర్మెన్‌కు వ్యతిరేకంగా ప్రత్యేక శిబిరంలో ఉన్నారు. బల నిరూపన రోజున వీరంతా ఖానాపూర్‌కు రానున్నారు.

# అవినీతికి నిలయంగా ఉపాధిహామీ

- ప్రజావేదికలో సభ్యుల ధ్వజం



**నవతెలంగాణ-ఇంద్రవెల్లి**

కేంద్ర ప్రభుత్వం కూలీలకు, వ్యవసాయ రైతులకు ఉపాధినిచ్చి ఆదుకోవాలనే ఉద్యేశంతో ప్రారంభించిన ఉపాధిహామీ పథకం సిబ్బంది, అధికారుల అవినీతికి పరాకాష్టగా మారింది. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. మండలంలో మొత్తం 28 గ్రామ పంచాయతీల్లో ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు రూ.7.16 కోట్లకు గాను జరిగిన వివిధ పనులకు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో సామాజిక బృందం ఆడిట్ నిర్వహించారు. ఆ పనులకు ఎంపీపీ పి.శోభ అధ్యక్షతన ప్రజావేదిక నిర్వహించగా దీనికి డీఆర్డీఓ కిషన్, ఏపీడీ రాథోడ్ రవీందర్ హాజరయ్యారు. వివిధ పంచాయతీల వారిగా జరిగిన పనులపై నివేదిక వివరిస్తుండగా మేజర్ జీపీ ఇంద్రవెల్లిలో రూ.2.24 కోట్ల పనులు జరిగాయని బృందం సభ్యులు తెలిపారు. ఉపాధి సిబ్బంది పాస్ ఆర్డర్ లేకుండానే రూ.65 వేలు, హార్టికల్చర్‌కు సంభందించిన రూ. 52 వేలు, రూ.39, 460 పేమెంట్‌లు చేశారని ఆడిట్ బృందం అధికారుల దృష్టికి తెచ్చారు. హరిత హారంలో నాటిన 900 మొక్కలలో కేవలం 300 మొక్కలు మాత్రమే బతికి ఉన్నాయని వివరించారు. మొక్కలకు నీటిని పోసినట్లు బిల్లులు చేశారని తెలిపారు. దీంతో ప్రజావేదికకు వచ్చిన సభ్యులు దత్తా ఆర్య, కాంగ్రెస్ నాయకులు సోమురే నాగోరావ్ కల్పించుకొని, ఇంద్రవెల్లి జీపీలో గ్రామ సభ నామమాత్రంగా జరుగుతోందని అన్నారు. ఉపాధి హామీలో అనేక అవినీతి జరిగిందని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆడిట్ బృందం రమేష్ అనే అధికారి ఈజీఎస్ సిబ్బందికి అనుకూలంగా గుట్టు చప్పుడు కాకుండా ఏక పక్షంగా ఆడిట్ నిర్వహించారని ఆరోపించారు. ఈ జీపీకి రీ ఆడిట్ నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో సర్పంచ్‌కు సభ్యుల మధ్య కొంత సేపు వాగ్వాదం కొనసాగింది. చివరకు డీఆర్డీఓ కిషన్ కల్పించుకొని ఏపీడీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రీ ఆడిట్‌ను నిర్వహిస్తామని హామీనివ్వడంతో సభ్యులు శాంతించారు. ముత్నూర్ జీపీలో జరిగిన పనులకు సిబ్బంది 42 మంది కూలీల సంతకాలు లేకుండానే రూ.10వేల వేతనాలు చెల్లించారని వివరించారు. ఇదే జీపీలో పనులు చేయకుండానే వేతనాలు చెల్లించారని, మళ్లింపు కాలువ పనులు చేయ కుండానే రూ.8 వేలు పేమెంట్ చేశారని అన్నారు. అనేక చోట్ల పే స్లిప్పు ఇవ్వకుండానే చెల్లింపులు చేస్తున్నారని వెల్లడించారు. దీంతో పాటు కెస్లాపూర్, గౌరపూర్, వాడ్‌గావ్, శంకర్‌గూడ, దనోర(బి), దొడంద, ఘటేపల్లి తదితర జీపీల్లో జరిగిన వివిధ పనులకు మాస్టర్ రోల్‌లో సంతకాలు లేకుండా పనులు, ఈసీ చెక్ మేజర్ లేకుండానే అనేక చోట్ల పేమెంట్లు చేశారని అధికారులకు తేల్చిచెప్పారు. బావుల పూడిక తీత, హరిత హారంలో నాటిన మొక్కలు సగానికి సగం లేవని స్పష్టం చేశారు. దీని పై కూలకషంగా వ్యవహరించిన అధికారులు ముత్నూర్ ఫీల్డ్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీస్ ఇస్తామని ప్రకటించారు. సాయంత్రం వరకు 28 జీపీల ప్రజావేదిక కొనసాగింది. ఈ ప్రజావేదికలో ఎంపీడీఓ పుష్పలత, ఎంపీపీ శోభా, జెడ్పీటీసీ.అర్క పుష్పలత, డీఆర్పీలు, సర్పంచులు, సెక్రటరీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అధికారులు ప్రజలకు జవాబు దారిగా ఉండాలి

- ఆర్డీఓ రత్న కళ్యాణి



**నవతెలంగాణ-కడెం**

అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలని ఆర్డీఓ రత్న కళ్యాణి అన్నారు. మంగళవారం మండలంలోని అంబారిపేట్, కొండుకూర్, ధర్మాజీపేట్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా ఆయా గ్రామాలను డీఆర్డీఓ విజయలక్ష్మీతో కలిసి సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఆరు గ్యారంటీలను ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తుదారులకు ఎలాంటి సందేహాలున్న అధికారులను అడిగి అర్హత కలిగిన ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏపీఓ జయదేవ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు గొల్ల వేణుగోపాల్, అంబారిపేట్ సర్పంచ్, కొప్పుల లక్ష్మీ లచ్చన్న, ఎంపీటీసీ కట్ల సింధూజ, సాగర్, ధర్మాజీపేట్ సర్పంచ్ ఓర్సు వెంకటేష్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి రమేష్, సత్యంచారి, రేంకల శీను, కొప్పుల రమేష్, జక్కుల సతీష్, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ వర్కర్లు, గ్రామ కార్మికులు పాల్గొన్నారు.

**లక్ష్మణచాంద :** ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ఆరు గ్యారంటీల పథకాలకు సంబంధించిన దరఖాస్తుల పర్వం కొనసాగుతుంది. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శేఖర్ కోరారు. మంగళవారం మండలంలోని కనకపూర్, బోరిగాం, వడ్యాల గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి శ్యామ్‌రావు రాథోడ్, ఎంపీపీ అడ్వాల పద్మ, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్‌ల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలందరూ ఎలాంటి తప్పులు దొర్లకుండా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీఓ నసీరుద్దీన్, సర్పంచ్లు సుక్కు రాజవ్వ, లలిత, పంచాయతీ కార్యదర్శులు, మండల వ్యవసాయధికారి ప్రవీణ్ కుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, ఆశా సిబ్బంది,ఈజీఎస్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, మండల పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**నిర్మల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీను అర్హులైన లబ్దిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వార్డు నెం 20 బర్కత్‌పుర ప్రాంతంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తుల స్వీకరణను మున్సిపల్ చైర్మెన్ గంద్రత్ ఈశ్వర్ మంగళవారం పరిశీలించారు. దరఖాస్తుదారులకు అభయా హస్తం ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పించారు. దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సంబంధిత దరఖాస్తు స్వీకరణ కౌంటర్లు ఏర్పాటు చేసామని అన్నారు. అర్హులైన లబ్దిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ముజాయిద్ చౌస్, సిబ్బంది పాల్గొన్నారు.

## రెజ్లింగ్ కుస్తీ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థినులు



**నవతెలంగాణ-ఉట్నూర్**

రెజ్లింగ్ కుస్తీ పోటీల్లో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. మంగళవారం పట్టణంలోని కేబి కాంప్లెక్స్‌లో రాష్ట్ర స్థాయి ఇంటర్ సొసైటీ లీగ్ సెలక్షన్ నిర్వహించారు. రెజ్లింగ్ కుస్తీ పోటీలలో 60 కేజీల విభాగంలో ఎం మౌనిక పదో తరగతి, ఎం.త్రిష తొమ్మిదో తరగతి, 57 కేజీల విభాగంలో బి.దేవశాల తొమ్మిదో తరగతి, 68 కేజీల విభాగం కుస్తీ పోటీలలో ఇంటర్ సొసైటీ లీగ్ రాష్ట్రీయ స్థాయిలో ఎంపికయ్యారు. గిరిజన సంక్షేమ అధికారి డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఆడే విశ్వనాథ్, పీడీ హేమంత్, పీడీ లక్ష్మి, రెజ్లింగ్ కోచ్ సెలక్షన్ ఆఫీసర్‌గా ఆర్.గోపాల్, ఆర్ శ్రీనివాస్, పీడీ మధుసూదన్, పీడీ రవి, పీడీ భద్రాచలం, జలపతి, రాథోడ్ రవీందర్ పీడీ పాల్గొన్నారు.

## స్వేచ్ఛకు సంకెళ్లు కవితా సంకలన ఆవిష్కరణ



**నవతెలంగాణ-నిర్మల్**

నిర్మల్ జిల్లాకు చెందిన యువ కళాకారుడు, కవి పోలీస్ భీమేష్ తెలుగు విశ్వవిద్యాలయం ఆమోద, ఆర్థిక ప్రోత్సాహంతో రచించిన స్వేచ్ఛకు సంకెళ్ళ అనే మొదటి కవితా సంకలనాన్ని రాజ్ భవన్‌లో గవర్నర్ తమిళిసై సుందరరాజన్ ఆవిష్కరించారు. మంగళవారం ఈ సందర్భంగా నిర్మల్ కవులు అభినందనలు తెలియజేశారు. ఈ ఆవిష్కరణలో కర్రె అమర్నాద్ రాజ్ భవన్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సంకలనానికి ప్రముఖ కవి ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, మాజీ తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మెన్ జూలూరు గౌరీశంకర్, ముందు మాట అందించారు. ఈ పుస్తక ముఖచిత్రం తెలంగాణ తల్లి రూపశిల్పి బీవీఆర్ చారి గీయటం జరిగింది. ఈ సంకలనాన్ని భీమేష్ తన తల్లి భూదేవికి అంకితమిచ్చారు. సామాజికాంశాల్లో తెలంగాణ పల్లె భాష యాసలో కవిత్వం ఉంటుందని కవి తెలియజేశారు. ఈ సందర్భంగా భీమేష్‌కు నిర్మల్ జిల్లా కవులు దామెర రాములు, డా.అప్పాల చక్రధారి, మునిమడుగుల రాజారావ్, కారం శంకర్, తుమ్మల దేవ్‌రావ్, అంబటి నారాయణ, నేరెళ్ల హనుమంతు, పత్తి శివప్రసాద్, కామారపు జగదీశ్వర్, మచ్చెంధర్, బి.వెంకట్, నిర్మల్ కవులు, కళాకారులు మంగళవారం అభినందనలు తెలిపారు.

## ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



**నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్**

పదవీ విరమణ పొందిన ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ఖచ్చితమైన శ్రద్ధ వహిస్తూ నిరంతరం వ్యాయామం చేయాలని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన మారుతిని పూలమాల శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పదవీ విరమణ పొందిన అనంతరం కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, సన్నిహితులతో ఆనందంగా గడపాలని అన్నారు. హోంగార్డులకు పెన్షన్ వర్తించదని అన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడే ప్రభుత్వ లేదా ప్రయివేటు పెన్షన్ ఆధారిత పథకాలలో చేరితే పదవీ విరమణ పొందిన అనంతరం ఎటువంటి కష్టాలు లేకుండా ఉండవచ్చని సూచించారు. పదవీ విరమణ పొందిన జి.మారుతి 1984వ సంవత్సరంలో హోంగార్డుగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో చేరి దాదాపు 40 సంవత్సరాల పాటు ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో విధులను నిర్వర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, హోంగార్డు ఆర్ఐ స్వామి, హోంగార్డ్ ఆఫీసు సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

## నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



**నవతెలంగాణ-ఉట్నూర్**

ఐటీడీఏ పీఓ చాహత్ భాజ్ పాయ్, ఐటీడీఏ ఏపీఓ భీంరావ్, డీడీ దిలీప్ కుమార్, ఎంపీపీ పంద్ర జైవంతరావుల చేతుల మీదుగా మంగళవారం నవతెలంగాణ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ ఉట్నూర్ డివిజన్ ఇన్‌చార్జీ గోపి, ఉట్నూర్ రిపోర్టర్ వసంత్‌రావు టీటీఎఫ్ నాయకులు చంద్రకాంత్ ఉన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్

ఎయిడెడ్, సమగ్ర శిక్ష, కేజీబీవీ, ఆశ్రమ, పాఠశాలలు, మైనార్టీ గురుకుల అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు నేటి వరకు వేతనాలు చెల్లించకపోవడం శోచనీయమని, వెంటనే పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని టీఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, ఇందూరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వేతనాలు లేక ఉపాధ్యాయులు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబ పోషణ చాలా ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. ప్రతినెల 5లోపు వేతనాలు విడుదల చేయాలని సంఘం రాష్ట్ర బాధ్యులు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ప్రాతినిధ్యం చేసినప్పటికీ ఇంతవరకు వేతనాలు విడుదల కాకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. తక్కువ వేతనాలతో శ్రమ దోపిడీకి గురవుతున్న పరిస్థితి రాష్ట్ర విద్యారంగంలో కనిపిస్తోందన్నారు.

## క్రీడలతోనే మానసికోల్లాసం


నవతెలంగాణ - పెంచికల్‌పేట్

క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్‌ఐ కొమురయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కొండపెల్లి గ్రామంలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ సంజయ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవరుచుకోవాలని, క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. యువత క్రీడలతో శారీరకంగా దృఢంగా ఉంటారని, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు సుధాకర్, పరదేశీ, యువకులు నారాయణ, సాయికిరణ్, సురేష్, లచ్చన్న, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.



## నాణ్యమైన విద్యా బోధన అందించాలి

- పాఠశాలలను తనిఖీ చేసిన ఎంపీపీ పెందూర్ మోతీరాం



నవతెలంగాణ-కెరమెరి

మారుమూల ప్రాంతాల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని ఎంపీపీ పెందూర్ మోతీరాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల సిబ్బంది ఆఫీసు రూమ్‌లో ఒకే చోట ఉండడంతో అసతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో ఏమైన సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధనపై విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఇంగ్లీషు, గణితతంపై పలు ప్రశ్నలు వేసి, విద్యార్థులతో బోర్డుపై ఎక్కాలు, ఇంగ్లీష్ అక్షరాలను రాయించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించి గ్రామీణ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అక్షర దోషాలు లేకుండా రాయడం, చదవడం నేర్పించాలని సూచించారు. అనంతరం ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యా బోధనపై ఆరా తీశారు. ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల సమస్యపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం జారీ చేసిన మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. మధ్యాహ్నం భోజనంలో భాగంగా గుడ్డు తినని వారికి అరటి పండ్లు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు సెడ్మకి తుకారాం ఉపాధ్యాయులు భాస్కర్, మౌనిక, నరేష్, మౌనిక పాల్గొన్నారు.

## అలరించిన మెగా డ్యాన్స్ షో



నవతెలంగాణ - కాగజ్‌నగర్

ఇండియన్ మోక్షిత డాన్స్ అకాడమీ అధ్వర్యంలో సోమవారం రాత్రి ఎస్పీఎం మైదానంలో నిర్వహించిన మెగా డ్యాన్స్ షో వీక్షకులను అలరించింది. ఆసిఫాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన డాన్స్ మాస్టర్లు ప్రదర్శించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం లక్కీడ్రాలో విజేతలను ఎంపిక చేశారు. ముఖ్య అతిథులుగా ఎస్పీఎం ప్రతినిధులు ఏకే మిశ్రా, హైమన్ గిరీష్, తెలంగాణ డాన్స్ స్పోర్ట్స్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, విజేత హాస్పిటల్ డాక్టర్ విద్యాసాగర్, రూరల్ సీఐ నాగరాజు విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కాగజ్‌నగర్ నంగాంబస్తీకి చెందిన శ్రీదేవి మొదటి బహుమతి, కౌటాల మండలం ముత్తంపేట్‌కు చెందిన జొన్నల హరీష్ కుమార్ రెండవ బహుమతి, కాగజ్‌నగర్ పట్టణం సర్‌సిల్క్‌కు చెందిన ఎండీ తాజుద్దీన్ మూడవ బహుమతి గెలుపొందారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మోక్షిత డాన్స్ అకాడమీ మాస్టర్ డోంగ్రి సంతోష్, తెలంగాణ ఉద్యమ గాయకుడు కొప్పర్తి సురేందర్, లయన్స్ క్లబ్ డైరెక్టర్ కోట వెంకన్న, మంచిర్యాల సీనియర్ డాన్స్ మాస్టర్ దుర్గం విజయ్, మయూరి విద్యాలయం కరస్పాండెంట్ యాదగిరి, బాలభరతి స్కూల్ చైర్మెన్ వసీముద్దిన్, టీచర్ వినోద్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన పద్మశాలీ సంఘం సభ్యులు



నవతెలంగాణ - కాగజ్‌నగర్

నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబును పట్టణ పద్మశాలీ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ఎమ్మెల్యేను సన్మానించారు. పట్టణ పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షులు దాసరి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్‌కుమార్, గౌరవ అధ్యక్షులు గడదాసు నారాయణ, ఉపాధ్యక్షులు పడాల రాజయ్య, పొట్లబత్తిని సదానందం, వంగరి రవికుమార్, గౌరవ సలహాదారులు గాదెఫ్ వెంకటి, యూత్ అధ్యక్షులు తన్నీరు కిరణ్‌కుమార్, సహాయ కార్యదర్శులు ఎక్కలదేవి వెంకట రాములు, ప్రచార కార్యదర్శులు కోడం గంగాధర్, బింగి వేణుగోపాల్, వార్డ్ ఇన్‌చార్జీలు సింగం శ్రీనివాస్, చిందం అశోక్, రాపెల్లి కనకరాజు, కొలిపాక జగదీశ్వర్, బింగి రమేష్‌బాబు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

**వాంకిడి :** మండలంలోని బెండారా, తెగాపూర్, చిచ్చుపెల్లి, నవెగూడ గ్రామాల్లో మంగళవారం ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించామని తహసీల్దార్ రెహిమొద్దీన్ తెలిపారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఆయా గ్రామ పంచాయతీలో అందజేయాలని కోరారు.

# ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ - సిర్పూర్(టి)

రాష్ట్ర ప్రభుత్వం అందజేసే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని గుర్తించడానికి ఇది ప్రత్యేకమైన వేదికని, అలాగే తమ గ్రామాల్లో ఉన్న సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రజాప్రతినిధులందరు మండల అభివృద్ధి కోసం ఏకం కావాలన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనేతరులు పడుతున్న కష్టాలను దృష్టిలో పెట్టుకొని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. గిరిజనేతరులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని శాశ్వత పరిష్కారం చూపిస్తానన్నారు. మండలంలో నిలిచిపోయిన చీలపెల్లి, ఇటుకలపహాడ్ రైల్వే ఫ్లైఓవర్‌ను త్వరలోనే పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు. ఇన్‌చార్జి జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకొనేలా అధికారులు వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సురేష్‌బాబు, జెడ్పీటీసీ నేరెటి రేఖ, ఎంపీపీ చునార్కర్ సువర్ణ, సర్పంచ్ తసీమా పర్వీన్, ఎంపీడీఓ రాజేశ్వర్, ఎంపీటీసీ సోయల్ హైమద్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్ పాల్గొన్నారు.

**చింతలమానేపల్లి:** మండలంలోని బాబాసాగర్, రవీంద్రనగర్-2 గ్రామాల్లో మంగళవారం ప్రజా పాలన సదస్సులో ఎమ్మెల్యే హరీష్‌బాబు పాల్గొన్ని మాట్లాడారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిచే విధంగా చూడాలన్నారు. ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదు సంవత్సరాల్లో నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ఏజెన్సీ గ్రామాలలో గిరిజనేతరులు పడుతున్న కష్టాలను దృష్టిలో పెట్టుకొని అసెంబ్లీలో ఈ సమస్యను చర్చిస్తానని పేర్కొన్నారు. రవీంద్రనగర్-2 గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి అనంతరం ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ప్రహరీ గోడతో పాటు మరుగుదొడ్లు నిర్మించాలని గ్రామస్తులు కోరడంతో త్వరలోనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి అయ్యే విధగా చూస్తామన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి రైతులకు సాగు నీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మండల అధ్యక్షులు రామగోని తిరుపతిగౌడ్, మాజీ జెడ్పీటీసీ ఎల్ములే మల్లయ్య, ఎంపిడిఓ సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మస్కుర్ అలి, ఎంపీపీ దుబ్బుల నానయ్య, కో- ఆప్షన్ మెంబర్ నాజీం హుస్సేన్, సర్పంచ్ కత్తెర్ల సుశీల, సుశీల్ మండల్, నాయకులు చాప్లే సుధాకర్, తుకారాం, పవన్, మోహన్ పాల్గొన్నారు.





సిర్పూర్(టి), చింతలమానేపల్లిలో ప్రజాపాలన కార్యక్రమాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

# ప్రజాపాలన ద్వారా ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ ఫలాలు

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ తెలిపారు. మంగళవారం రెబ్బెన మండలం రోల్లపాడు గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన లబ్ధిదారులకు ప్రజాపాలన కార్యక్రమం ద్వారా సంక్షేమ ఫలాలను అందించేందుకు గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా పూర్తిస్థాయి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ నెల 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, దరఖాస్తుదారులు ముందస్తుగానే తమ దరఖాస్తును నింపి దరఖాస్తుల స్వీకరణ కౌంటర్లలో అందించాలని తెలిపారు. దరఖాస్తుదారులు నిజమైన సమాచారాన్ని ఫారంలో పొందుపర్చాలని, తద్వారా అర్హత గల లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 365 గ్రామపంచాయతీలు, 1 పురపాలక సంఘం ఉందని, దరఖాస్తుల స్వీకరణ కొరకు 1,335 కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దరఖాస్తుదారునికి తప్పనిసరిగా రశీదు అందించడం జరుగుతుందని తెలిపారు.

**ఆసిఫాబాద్‌లో అదనపు కలెక్టర్ మనోజ్ తివారి**

ఆసిఫాబాద్‌లోని ఈదులవాడ గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రజా పాలనలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ప్రజాపాలన దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని, ఎవరు కూడా బయట ఫారాలు తీసుకోవద్దని అన్నారు. దరఖాస్తు ఫారాలు ఇచ్చేటప్పుడు ఇంటి యజమాని ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ పత్రాలు ఉంటే సరిపోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, ఆ గ్రామ సర్పంచ్ భూసి భీమేష్ పాల్గొన్నారు.





ఆసిఫాబాద్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఆసిఫాబాద్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

# కొత్త సంవత్సరంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కొత్త సంవత్సరంలో జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడానికి జిల్లా అధికారులు కృషి చేయాలని పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోయం ఇందురావు కోరారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్‌ను వేర్వేరుగా కలిశారు. సంఘం క్యాలెండర్లను కలెక్టర్‌తో ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ నాయకులు ఉపాధ్యాయ సమస్యలకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని, జిల్లా విద్యాశాఖ అధికారి రెగ్యులర్‌గా ఉండే విధంగా కొత్తవారిని నియమించాలని కోరారు. వివిధ ఉపాధ్యాయ సంఘాలలో పనిచేస్తున్న వారు కోఆర్డినేటర్లుగా ఉన్నారని, వారిని తొలగించాలని, నూతనంగా కోఆర్డినేటర్లను నియమించాలని కోరారు. ఎన్నికల విధులు నిర్వహించిన ఎన్నికల సిబ్బందికి పారితోషికాన్ని చెల్లించాలని, ఎస్సెస్సీ మూల్యాంకనం కేంద్రాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని, ఇన్‌సర్వీస్ బిఎడ్ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, రెండో విడత మన ఊరు మన పాఠశాల కార్యక్రమాన్ని ప్రారంభించాలని, జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టు, నూతన మండలాలు పెంచికల్‌పేట్, చింతలమానేపల్లి, లింగాపూర్ మండలాలకు విద్యాశాఖ అధికారి పోస్టులను మంజూరు అయ్యేవిధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆడే ప్రకాష్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎనగంటి భిక్షపతి, లకావత్ శంకర్, సత్యనారాయణ, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మడావి హనుమంతు, తంగళ్లపల్లి రాకేష్, సాంబశివరావు, గుల్లపల్లి రవిశంకర్, లవన్ కుమార్, జాదవ్ గోవిందరావ్, సత్యనారాయణ , లక్ష్మయ్య పాల్గొన్నారు. టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సోయం ఇందురావుతో పాటు హేమంత్ షిండే, కాంపెల్లి ఊశన్న, రమేష్, కోట తిరుపతి, జాదవ్ సుభాష్, తిప్పరెడ్డి రాజు పాల్గొన్నారు.





## సమిష్టిగా పనిచేసి జిల్లాను అభివృద్ధి చేద్దాం

- కలెక్టర్ బోర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా అధికార యంత్రాంగం అందరం సమిష్టిగా పనిచేసి జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేద్దామని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. నూతన సంవత్సరాది సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బందితో కలిసి మంగళవారం కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం అంకితభావంతో సమిష్టిగా కృషి చేసి జిల్లా అభివృద్ధికి దోహదపడాలన్నారు. అభివృద్ధిలో ప్రతి అధికారి భాగస్వామి కావాలని సూచించారు. 2024 ప్రతి ఒక్కరికి కలిసి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కదం సురేష్, ఏడీ సోమేశ్వర్, డీఎస్ఓ తారామణి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, ఆసిఫాబాద్ సబ్ జైలర్ ప్రేమ్‌కుమార్, వసతి గృహాల సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

**టీఎన్జీవో ఆధ్వర్యంలో శుభాకాంక్షలు**

టీఎన్జీవో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ బోర్కడే హేమంత్, ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా అధ్యక్షులు లింగాల రాజశేఖర్, ఉపాధ్యక్షురాలు కరుణశ్రీ, భోగ మధుకర్, శ్రీనివాస్, కీర్తిపాల్, దేవాజి, చందన, గణేష్, శ్రీకాంత్, పృథ్వి పాల్గొన్నారు.

## గురుకులాల అవుట్ సోర్సింగ్ ప్రిన్సిపాళ్లను తొలగించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వివిధ గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ప్రిన్సిపాళ్లను వెంటనే తొలగించాలని డివైఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ బోర్కడే హేమంత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని మైనార్టీ ఆధ్వర్యంలో నడుస్తున్న రెండు గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ప్రిన్సిపాల్స్ కొనసాగుతున్నారన్నారు. అదే పాఠశాలల్లో అర్హత గల పిజిటి జూనియర్ అధ్యాపకులు అందుబాటులో ఉన్నప్పటికీ వారిని కాదని అవుట్ సోర్సింగ్ వారిని కొనసాగిస్తున్నారని తెలిపారు. కాగజ్‌నగర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలేలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్ కూడా గతంలో ఉపాధ్యాయునిగా పనిచేసే పదవి విరమణ చెందినవాడేనన్నారు. ప్రిన్సిపాల్స్‌ను ఎటువంటి పరీక్ష నిర్వహించకుండా ఎంపిక చేయడం జీవో నెంబర్ 4459 ప్రకారం విరుద్ధమన్నారు. వెంటనే వారందరినీ తొలగించి అర్హత గల వారిని ఆయా పోస్టుల్లో నియమించాలని డిమాండ్ చేశారు. అప్పుడే విద్యార్థులకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే పదవి విరమణ చెందిన వారు కావడంతో ఆయా గురుకులాల్లో జరిగే నియామకాలు ఇష్టారాజ్యాంగ కొనసాగుతున్నాయన్నారు. స్థానికంగా వారు అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. నియామక ప్రక్రియలు ఆర్‌ఎల్సి స్థాయి అధికారులు కూడా అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గురుకులాల్లో ప్రస్తుతం జరుగుతున్న వ్యవహారాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికనంద్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, విద్యార్థి నిరుద్యోగ జేఏసీ పొన్న రమేష్, టిపిటిఎఫ్ అధ్యక్షులు మహమ్మద్ ఆసిఫ్ పాల్గొన్నారు.

## పందులకు టీకాలు వేయించాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

పందులలో వ్యాపించే క్లాసికల్ స్వైన్ ఫీవర్ వ్యాధి నిర్మూలనకు పందులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని కాగజ్‌నగర్ పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సర్‌సిల్క్ ఏరియాలో 108 పందులకు క్లాసికల్ స్వైన్ ఫీవర్ వ్యాక్సిన్లు వేశారు. డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ క్లాసికల్ స్వైన్ ఫీవర్ వ్యాధి సోకితే పందులలో జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుందని, కళ్లు ఎర్రబడి నీరసంగా ఉండి నరాల బలహీనతతో నడకలో మార్పు వచ్చి చనిపోతాయని తెలిపారు. పందుల కాపరులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన

నవతెలంగాణ-జన్నారం



విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకొని, బాల్యం నుండే పరిశీలన, శాస్త్రీయ దృక్పథం అలవాటు చేసుకోవాలని జిజ్ఞాస సంచార ప్రయోగశాల నిర్వాహకులు సాయికుమార్, సంపత్ కుమార్ అన్నారు మంగళవారం మండలంలోని తపాలాపూర్ హైస్కూల్లో సైన్స్‌పై ప్రదర్శన నిర్వహించి, విద్యార్థులకు సైన్స్ పట్ల అభిరుచి, ఆసక్తి పెంచేవిదంగా ఆవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్ మురళీధర్, సైన్స్ ఉపాధ్యాయులు డి తిరుపతి, శ్రీదేవి పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్రాక్‌సూట్స్ అందజేత

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని కలమడుగు జడ్పీ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు మంగళవారం ఎన్ఆర్ఐ నవీన్ కుమార్ సహకారంతో ట్రాక్ సూట్స్ అందజేశారు. క్రీడల్లో రానిస్తున్న విద్యార్థులకు తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సందర్బంగా ఎన్ఆర్ఐ నవీన్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి ఉపాధ్యాయులు, రమేష్ సాగర్ రాజేందర్ కవిత పాల్గొన్నారు.

## పేదింటి పెండ్లికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



నవతెలంగాణ-జైపూర్

మండలం దుబ్బపల్లి గ్రామంలో ఈ నెల 3న జరుగనున్న పేదింటి పెండ్లికి జైపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. నిరుపేద కుంటుమానికి చెందిన మాల్కరి చంద్రయ్య తన కూతురు మనీషా వివాహం జరిపించడం కోసం అందినకాడికి అప్పులు చేస్తున్నట్లు తెల్సుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం మాల్కరి చంద్రయ్యను కలిసి తమ వంతుగా రూ.5 వేలు సాయం చేశారు. 2000 సంవత్సరం పూర్వ విద్యార్థులు సొసైటీగా ఏర్పడి ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా దుబ్బపల్లి గ్రామానికి చెందిన మాల్కరి చంద్రయ్య భార్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు తెలుసుకున్నారు. ఒక వైపు భార్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం మరో వైపు కూతురుకు వివాహ సంబంధం కుదురడంతో పూర్వ విద్యార్థులు తమ సొసైటీ ద్వార ఆదుకోవాలని ముందుకు వచ్చారు. ఈ మేరకు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు రమేష్, వేణు, మల్లేష్, దామోదర్‌రెడ్డి, చంద్రయ్యతో పాటు పెళ్లి కూతురు మనిషాను కలిసి ఆర్థిక సాయం అందజేశారు.

## ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర కీలకం



నవతెలంగాణ-నస్పూర్

ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర కీలకమైనదని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నవతెలంగాణ 2024 క్యాలెండర్‌ను కలెక్టర్, మంచిర్యాల ఎంఎల్ఏ ప్రేమ్ సాగర్ రావు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా అభివృద్ధి కార్యక్రమాల అనుసంధాన కర్తలుగా పాత్రికేయులు బాగా స్వాములు కావాలన్నారు. క్షేత్రస్థాయిలో చిన్నపాటి సమస్యలు ఎదురైన పాత్రికేయుల చొరవతోనే వాటిని సరిదిద్దచ్చని అన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజా సంక్షేమం కొరకే అభివృద్ధి పథకాలను ప్రవేశపెడుతుందని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా రంగం కృషి గణనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ ఏడీవిటీ ప్రేమ్ కుమార్, రిపోర్టర్లు తోట్ల మల్లేష్ యాదవ్, అత్తె సాగర్, లద్దూరి రమేష్ కుమార్, తలారి సమ్మయ్య పాల్గొన్నారు.

## ఎస్సైకి గౌడ కులస్తుల సన్మానం

నవతెలంగాణ-జైపూర్



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండల సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం స్థానిక ఎస్సై ఉపేందర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్బంగా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు నేరేళ్ల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గుండా సురేష్ గౌడ్ ఎస్సై ఉపేందర్‌ను శాలువాతో సన్మానించారు. నూతన సంవత్సరంలో ఉద్యోగ బాధ్యతల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామ సభలు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని సోమగూడెం, లంబాడితాండ(డీ), మల్కేపల్లి, ధర్మారావుపేట, రొట్టెపల్లి గ్రామ పంచాయితీల్లో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలను ప్రారంభించారు. ఈ సంధర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆయా గ్రామాల్లో జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, స్పెషల్ ఆఫీసర్ గంగారాం, ఎంపీడీఓ ఎంఏ అలీం, తహసీల్దార్ బోజన్న, సర్పంచ్లు ప్రమీలాగౌడ్, అజ్మీర తిరుపతి, డీటీ మానిక్రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, ఎంపీటీసీ పర్వతి మల్లేశ్, భీంరావు, హెచ్ఎం రాథోడ్ రమేశ్, ఏపీఎం వెంకటేశ్వర్లు, ఆరలు సులోచన, శ్వేతరెడ్డి, ముత్తె భూమయ్య పాల్గొన్నారు.

## దేవాపూర్‌లో బడి బయట పిల్లల సర్వే

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పెద్దగూడ గ్రామంలో మంగళవారం బడి బయట పిల్లల గుర్తింపు కోసం సర్వే నిర్వహించారు. దేవాపూర్ సీఆర్పీ మంతెన రమేశ్ ఆధ్వర్యంలో సర్వే చేసి ఇద్దరు డ్రాపౌట్ పిల్లలను గుర్తించి వివరాలను నమోదు చేశారు. డ్రాపౌట్ పిల్లలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. తప్పకుండా పాఠశాలలకు, కళాశాలలకు పంపాలని, పాఠశాలలో, కళాశాలలో కల్పించే సౌకర్యాలను వివరించారు. సర్వేలో గుర్తించిన పిల్లలను ప్రబంధ్ పోర్టల్లో వివరాలు నమోదు చేసి ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలల్లో వారి వయస్సుకు తగిన తరగతిలో చేర్పించడం జరుగుతుందని సీఆర్పీ మంతెన రమేశ్ తెలిపారు.

# అర్హులందరికీ తప్పక సంక్షేమ ఫలాలు

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



నవతెలంగాణ-హాజీపూర్

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. మంగళవారం హాజీపూర్ మండలంలోని గుడిపేట్, నమ్నూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేది వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని తెలిపారు. దరఖాస్తులు నింపడంలో ఇబ్బందులు ఎదురైతే అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. హెల్ప్ డెస్కులు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు.

**బీఆర్ఎస్ ఖజానా ఖాళీ చేసింది**

ఎన్నికల ముందే బీఆర్ఎస్ సర్కార్ ప్రభుత్వ ఖజానా ఖాళీ చేసిందని, అందుకే రైతు బంధు డబ్బులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. వచ్చే వర్షాకాలం నుంచి ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం అందుతుందని పేర్కొన్నారు. కౌలుదారులను గత ప్రభుత్వం విస్మరించిందని, కాని కాంగ్రెస్ ప్రభుత్వం కౌలు రైతులకు కూడా సాయం అందించనుందని తెలిపారు. ఈ నెల నుంచే నెలకు రూ.4వేల పెన్షన్ అందుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాల కోసం ఎవరికీ లంచం ఇవ్వొద్దని అన్నారు. ఈ సందర్బంగా పలువురు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే వారితో మాట్లాడి బరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ నరేందర్, ఎస్సీ డీడీ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సతీష్, ఎంపీడీఓ అహ్మద్ హై, జడ్పీటీసీ పుస్కూరి శిల్ప శ్రీనివాస్ రావు, సర్పంచ్లు బేర పద్మ లగిషెట్టి లక్ష్మీ, ఎంపీటీసీలు ఒడ్డె బాలరాజు, డేగ బాపు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# విద్యార్థి వైద్యానికి ఉపాధ్యాయురాలి ఉదారత

- ఉపాధ్యాయురాలి చొరవతో రూ.28వేల సేకరణ



నవతెలంగాణ-జన్నారం

వాట్సాప్‌లో స్టేటస్ చూసి బాలుడి వైద్యానికి దాతలు సుమారు రూ.28000 విరాళం అందజేశారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన భూపెల్లి ప్రసాద్ రాణి దంపతుల కుమారుడైన వర్షిత్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. చదువులో ఎంతో చురుకుగా ఉండే వర్షిత్‌ను విధి బ్లడ్ కాన్సర్ రూపంలో వంచించింది. చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పత్రిలో చేర్పించగా సుమారు రూ.10లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. కూలి పనులు చేస్తూ జీవనం సాగించే తల్లిదండ్రులకు చికిత్స ఖర్చు పెను బారమైంది. దాతల సాయం కోసం సోషల్ మీడియాలో అభ్యర్థించారు. విషయం తెలుసుకున్న బాలుడు చదివే పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి తన వాట్సాప్ స్టేటస్‌లో బాలుడి పరిస్థితిని తెలియజేసింది. స్పందించిన దాతలు రూ.28 వేలు టీచర్‌కు పంపించి వారి ఉదరతను చాటారు. సేకరించిన మొత్తాన్ని మంగళవారం బాలుడి ఇంటికి వెళ్లి టీచర్ వారి తల్లిదండ్రులకు అందజేసి తన మానవత్వాన్ని చాటారు. ఇంకా ఎవరైనా సాయం చేయాలనుకునే దాతలు ఫోన్ పే, గూగుల్ పే 7569933139 నెంబర్‌లో గాని, భూపెల్లి సుమన్ 041410100188721 యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐఎఫ్‌సీఐ నెం.యూబీఐఎన్0804142 ఖాతాలో వేయాలని కోరారు.

# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బహుమతుల ప్రధానం



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని సబ్బపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవ సందర్బంగా విద్యార్థులకు అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, విద్యాశాఖ సెక్టరల్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి లు బహుమతులు అందించారు. వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతి గెలుపొందిన అభిరామ్ పదవ తరగతి, ముగ్గుల పోటీలో నలుగురు, అంజలి అన్విత తేజ, సహానా, రష్మితలు బహుమతులు గెలుపొందారు. ఈ సందర్బంగా మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ అధ్యయనం పోరాటం అనే నినాదంతో 1970 లోని కేరళ రాష్ట్రంలో ఏర్పడిన ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యార్థి సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్నటువంటి ఏకైక విద్యార్థి సంఘం అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి గత చరిత్ర భగత్ సింగ్ లాంటి ప్రాణత్యాగాలను విద్యార్థులకు తెలపడానికి ఈ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. చరిత్రను సృష్టించాలంటే అందరూ ఓడిపోయి వాళ్లే, మీ జీవితాల్లో ఒక లక్ష్యం పెట్టుకొని లక్ష్యం వైపు అడుగులు వేయండి, బంగారు భవిష్యత్ విద్యార్థుల నుంచి మొదలవుతుందన్నారు. చరిత్రను సృష్టించాలంటే చదువు ఒకటే మార్గం, అంబేద్కర్, భగత్ సింగ్ లాంటి ఉన్నత స్థాయి శిఖరానికి విద్యార్థులు వెళ్లాలంటే మంచి ఆయుధం చదువు, మొక్క ఎలా నాటితే భవిష్యత్ తరానికి అలానే ఫలాన్నిస్తుందన్నారు.

## అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తాం

- ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-మందమర్రి

అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులను ఖచ్చితంగా ఇస్తామని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. మందమర్రి మున్సిపాలిటీలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమంలో అభయ హస్తం ఆరు గ్యారంటీల ధరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి మంగళవారం హాజరైన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు రెండు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు. రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేస్తుందన్నారు. అభయహస్తం ధరఖాస్తు అందరూ చేసుకునేలా చూడాలని అధికారులకు, నాయకులకు సూచించారు. దరఖాస్తు చేసుకోలేని వారి ఇంటికి వెళ్లాలని ఫోన్ చేసి మాట్లాడాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్షి, మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, డీఆర్డీఓ శేషాద్రి పాల్గొన్నారు.

## ఆరు వరకు దరఖాస్తుల స్వీకరణ సాగుతుంది

నవతెలంగాణ-జన్నారం

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజాపాలన ద్వారా అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఈ నెల ఆరు వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఎంపీడీఓ అరుణరాణి, రేండ్లగూడ సర్పంచ్ నెమలికొండ ఆశరాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని రేండ్లగూడ, 9 గుడిసెల పల్లె, రోటి గుడా, సింగరాయపేట గ్రామపంచాయతీలో వేరువేరుగా ప్రజాపాలన అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 2 రోజులుగా సెలవులు ఉండడంతో ఈ కార్యక్రమానికి బ్రేక్ పడిందని అన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఎలాంటి ఆందోళన గురికాకుండా తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. దరఖాస్తుకు రేషన్ కార్డ్ ఆధార్ కార్డు మాత్రమే జత చేయాలని సూచించారు కార్యక్రమంలో ఎంపీ ఈవో రమేష్, ఎంఈవో విజయ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రావు, రేండ్లగూడ ఎంపీటీసీ దాముఖ మమత కరుణాకర్, కామన్‌పల్లి ఎంపీటీసీ జునుగురి మాధురి సతీష్, రోటి గూడ సర్పంచ్ మలక విజయ్ లక్ష్మణ్, కాంగ్రెస్ అధ్యక్ష కార్యదర్శులు ముజాఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం పాల్గొన్నారు.



## కేటీఆర్‌ను కలిసిన మార్కెట్ కమిటీ డైరెక్టర్

నవతెలంగాణ-జన్నారం



మాజీ పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును మండల మార్కెట్ కమిటీ డైరెక్టర్ హరీష్‌గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో పార్టీ నాయకులు అంతా కలిసికట్టుగా పనిచేసి ఎంపీ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేయాలని కేటీఆర్ సూచించారు.

## కిష్టంపేట, మాదారంలో ప్రజాపాలన



నవతెలంగాణ-తాండూర్

మండల పరిధిలోని కిష్టంపేట మాదారం గ్రామపంచాయతీలలో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. మాదారంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో తహసిల్దార్ రోహిత్, కిష్టంపేటలో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ ప్రాతినిథ్యం వహించారు. కిష్టంపేటలో సర్పంచ్ సార్ల పద్మ అధ్యక్షతన దరఖాస్తులను స్వీకరించారు. సమావేశంలో ఎంపీపీ పూసాల ప్రణయ్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మురళీధర్ రావుఫిరంగి శంకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ప్రసాద్, ఏఈ ప్రభాకర్ ఏఎస్ఎం దేవి పంచాయతీ సెక్రెటరీ బాపు, అంగన్‌వాడీ టీచర్స్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. మాదారంలో జరిగిన ప్రజా పాలన కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీఓ పాల్గొని అధికారుల పనితీరును పరిశీలించారు. ప్రజా పాలనలో ప్రజల కోసం ఏర్పాటుచేసిన వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచన చేశారు. కార్యక్రమంలో ఏపీఓ నందకుమార్ ఎంపీటీసీ సూరం రవీందర్ కాపర్తి సుభాష్ పాల్గొన్నారు.

## దరఖాస్తులను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా పట్టణంలో స్థానిక ఠాగూర్ స్టేడియంలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణను ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఆలస్యం చేయకుండా ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని అన్నారు. రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోడానికి కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అలాగే కొత్త రేషన్ కార్డులను ఖచ్చితంగా ఇస్తామని అన్నారు. అభయహస్తం ధరఖాస్తు అందరు చేసుకోవాలని, చెయ్యని వారి ఇంటికి, ఫోన్ ద్వారా మాట్లాడి దరకస్తూ చేసుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, కమిషనర్ జి.వెంకట నారాయణ, కౌన్సిల్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది, మెప్మా రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

## లబ్దిపొందుతున్న వారు ధరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు

- జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రమేష్ కుమార్

నవతెలంగాణ-జైపూర్

ఇప్పటికే రైతు బంధు పొందుతున్న వారితో పాటు ఆసరా పింఛన్ పొందుతున్న లబ్దిదారులు ప్రజాపాలన గ్రామ సభల్లో మరోమారు ధరఖాస్తు చేసుకోవల్సిన అవసరం లేదని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రమేష్ కుమార్ సూచించారు. ఇప్పటి వరకు లబ్దిపొందని వారు మాత్రమే అభయహస్తం పథకం ద్వార ధరఖాస్తు చేసుకోవాలని అన్నారు. తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ, ఎంపీఓ అనిల్ కుమార్, వివిధ శాఖలకు చెందిన అదికారులు మంగళవారం ప్రజాపాలన గ్రామ సభల్లో వారు మాట్లాడారు. కిష్టాపూర్, వేలాల, ముదిగుంట, వెంకట్రావ్‌పల్లిల్లో ఏర్పాటు చేసిన గ్రామ సభల ద్వారా అభయహస్తం అర్జీలు స్వీకరించారు. ఆసరా పింఛన్ పొందుతున్న వారు చేయూత పథకం ద్వార ప్రభుత్వం ప్రకటించిన పెన్షన్ పొందడం జరుగుతుందని తెలిపారు. అయితే మహాలక్ష్మి పథకం ద్వార నిరుపేదలైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, పేద కుటుంబాల వారికి రూ.500 లకు గ్యాస్ సిలిండర్ పంపిణీ ప్రభుత్వం పంపిణీ చేయనుందని పేర్కొన్నారు. ముదిగుంట గ్రామ పంచాయతిలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో స్థానిక సర్పంచ్ జ్యోతితో పాటు ఎంపీపీ రమాదేవి లక్ష్మణ్ ప్రజాపాలన గ్రామ సభ నిర్వహించారు.

## బాల్య మిత్రుని కుటుంబానికి భరోసా

నవతెలంగాణ-తాండూర్

1990-91 తాండూర్‌హై స్కూల్ పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన బాల్య మిత్రులు తమ మిత్రుడు బుచ్చయ్య గత కొన్ని నెలల క్రితం మరణించడంతో అతని భార్యకు మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. గతంలో కోవిడ్ సమయంలో మరణించిన బాల్యమిత్రులు బాలేశ్వర్(అంకుశం) రమేష్ (కాసిపేట)లకు 75వేల సాయం అందించారు. ఆపద సమయంలో మిత్రుల కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకోవడానికి మిత్రులు ముందుకు రావడం సంతోషాన్నిచ్చిందని జట్టు నాయకుడు గాజుల రమేష్ తెలిపారు సహాయ కార్యక్రమాలు ఎల్లప్పుడూ కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జంపాల వసంత్, సుంకరి వామన్, సత్యనారాయణ, బొమ్మినేని రామ్మూర్తి, మేడి మధు, తోగరి పెంటయ్య పాల్గొన్నారు.

## ఆర్వీ కర్ణన్‌ను కలిసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

నవతెలంగాణ-ఉట్నూర్



ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మంగళవారం హైదరాబాదులోని కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ ఆర్వీ కర్ణన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఉట్నూరులో నిర్మిస్తున్న టీహబ్ ఆస్పత్రిని త్వరగా పూర్తిచేసి రానున్న రెండు మూడు నెలల్లో ప్రజలకు అందుబాటులో తీసుకురావడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న తాత్కాలిక స్టాఫ్ నర్సుల సమస్యలపై విన్నవించి పరిష్కారం చేయాలని కోరారు. ప్రస్తుతం భర్తీ చేస్తున్న స్టాఫ్ నర్స్ ఉద్యోగాలలో వారికి వేటేజీ మార్కులు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఏజెన్సీలో ఉన్న వైద్య సదుపాయాలు సిబ్బంది గురించి చర్చించడం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు.

## జీపీఎఫ్ బిల్లులు త్వరితగతిన చెల్లించాలి

నవతెలంగాణ-నిర్మల్



ఉపాధ్యాయుల జీపీఎఫ్ బిల్లులు త్వరితగతిన చెల్లించాలని కోరుతూ ఎస్టీయూ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సీఈఓ ఎం.సుధీర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్ మాట్లాడుతూ కొత్తగా జిల్లా ఏర్పాటైన తర్వాత నేటి వరకు ఒక జీపీఎఫ్ బిల్లు కూడా ట్రెజరీ, ఈ కుబేర్ ద్వారా చెల్లింపు జరగలేదని అన్నారు. సాంకేతిక కారణాలను పరిష్కరించి, ఉపాధ్యాయుల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు వెంకటేశ్వరరావు, లక్ష్మి నారాయణ, షేక్ నభి, లింగయ్య ఉన్నారు.

## ఓడ్ కులస్తులను ఓబీసీలో చేర్చాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఓడ్ కులస్తులతో పాటు మిగతా 17 కొత్త కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని ఓడ్ కుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి చావాన్ ప్రకాష్, సాలుంకే శంకర్ మంగళవారం జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మెన్ హంసరాజ్ గంగారాం అహిర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా గుర్తించిన 17 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగార్థులు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో వర్కింగ్ ప్రెసిడెంట్ మోహితే మారుతి, ఉపాధ్యక్షులు సాలుంకే భీంరావ్, చవాన్ గణేష్, మోహితే దేవిదాస్ పాల్గొన్నారు.

## అయోధ్య రాముడి అక్షింతలు శోభాయాత్ర

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శ్యాంపూర్ నుంచి నాగాపూర్ గ్రామానికి అయోధ్య రాముల వారి అక్షింతలు చేరుకున్నారు. అయోధ్య నుంచి తీసుకొచ్చిన రాముడి అక్షింతలను సర్పంచ్ సునీల్, కందుకూరి జీవన్, రమేష్‌లకు అందజేశారు. అక్షింతాలను మందిరంలో ఉంచి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, రాంచంద్ర, విష్ణు, జ్ఞానేశ్వర్, మహిళలు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్. సీహెచ్ వీ.ఆర్.ఆర్ వరప్రసాద్‌ని మంగళవారం ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇరువురు అధికారులు కాసేపు లోక్‌అదాలత్, కోర్టు కేసుల విషయాలపై చర్చించుకున్నారు.

## అభయహస్తం దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో భాగంగా మంగళవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో, గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మంగళవారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభయహస్తం కార్యక్రమంలో ఆరు గ్యారంటీలను అమలు పరచడానికి అర్హులైన ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి అలసత్వం వహించకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలతో దరఖాస్తుల స్వీకరణను విజయవంతం చేయాలని అన్నారు. ఇంకా నాలుగు రోజుల వరకు కొనసాగుతుందని అర్హులైన వారు తప్పక దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

## పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-తలమడుగు

పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడాల రవీందర్‌రెడ్డి, ఎంఈఓ నారాయణ, మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్ జీ.వెంకట్‌రావ్, ఎంపీఈఓ దిలీప్ కుమార్, పీఆర్టీయూ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మంగారపు మహేందర్ యాదవ్, నర్ర నవీన్ యాదవ్, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్, స్వామి, వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు గంగయ్య వినోద్‌రెడ్డి, ఇతర ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలను అమలుచేస్తాం

నవతెలంగాణ-బేల

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఫైజుల్లా ఖాన్ అన్నారు. మంగళవారం మండలంలోని పాటన్ గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తులను లబ్దిదారుల నుంచి స్వీకరించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీ అమలు చేయుటకై దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల్లో మెనిఫెస్టోలో పొందుపర్చారో వాటిని అమలు చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మహేందర్ కుమార్, పంచాయత్ కార్యదర్శి సుహాసిని, అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిని కలిసిన డా.నరేష్ జాదవ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీని మంగళవారం హైదరాబాద్‌లో ఏఐసీసీ సభ్యులు డా.నరేష్ జాదవ్ కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గం గురించి, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై చర్చించారు.

## ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌ను కలిసిన ఎస్సై

నవతెలంగాణ-కడెం

ఖానాపూర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జితిన్ కుమార్‌ను ఆయన కార్యాలయంలో మంగళవారం కడెం ఎస్సై కోసన రాజు మర్యాదపూర్వకంగా కలిసి వారికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## కేసీఆర్ ప్రభుత్వంలోనే మౌలిక సదుపాయాలు

నవతెలంగాణ-నేరడిగొండ

కేసీఆర్ ప్రభుత్వం ఆయాంలోనే గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మంగళవారం మండలంలోని సవర్గాం గ్రామంలో గత కేసీఆర్ ప్రభుత్వం ఆయాంలో మంజూరైన రూ.20లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హజరై పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరిట ప్రజలకు ఇబ్బంది పేడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జెడ్పీటీసీ జహీర్, వడూర్ ఎంపీటీసీ పండరి, స్థానిక సర్పంచ్ జాదవ్ కళ్యాణి మహేందర్, వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

### నాసిరకం పనులు చేస్తున్న

# గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కడెం



పునరావాస గృహాలను నాసిరకంగా నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని మైసంపేట లబ్దిదారులు అన్నారు. మంగళవారం వారు నిర్మాణ స్థలంలో నిరసన తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉన్న కవ్వాల్ పెద్దపులుల సంరక్షణ కేంద్రాన్ని 2012లో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పెద్దపులుల నివాసానికి అనువైన అటవీ ప్రాంతం ఉందని గుర్తించిన అటవీశాఖ ఉన్నతాధికారులు పెద్ద పులుల సంఖ్య పెంచేందుకు కావలసిన చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే అడవి జంతువులు తిరిగే ప్రాంతాల్లో ఉన్న కొన్ని గ్రామాలను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళిక రూపొందించారు. మండలంలోని మైసంపేట, రాంపూర్ గ్రామాలను మండలంలోని కొత్తమద్దిపడగ గ్రామ శివారులో నూతనంగా పునరావాస గృహాలను నిర్మించి ఇవ్వడానికి అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం సన్నద్ధమైంది. అయితే మద్దిపడగ గ్రామ శివారులో 94 ఇల్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టింది. ఇదే అదునుగా 94 ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి నాసిరకంగా ఇండ్లు నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇండ్లు పూర్తికానున్న నేపథ్యంలో అక్కడక్కడ పగుళ్లు తేలడంతో మైసంపేట లబ్దిదారులు కొత్త మద్దిపడగ గ్రామ శివారులో నిర్మిస్తున్న పునరావాస గృహాల వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తాము అటవీ ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి రావడానికి సిద్ధమైన నేపథ్యంలో ప్రభుత్వం నిర్మిస్తున్న పునరావాస గృహాల్లో నాణ్యతా లోపం కొట్టొచ్చినట్టు కనపడుతోందని ఇండ్లకు ప్లాస్టింగ్ వేసే క్రమంలో సిమెంట్ తక్కువ వేశారని అదేవిధంగా సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం కూడా నాసిరకంగా ఉందని వెంటనే ఇండ్లను నిర్మిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని మైసంపేట గ్రామస్తులు కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## బాలికల వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఐటీడీఏ పరిధిలోని గిరిజన బాలికల వసతి గృహాల సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థినులతో సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పలు సమస్యలను దృష్టికి తీసువచ్చారని తెలిపారు. తమ గదులు ఫ్యాన్లు సరిగ్గా పని చేయడం లేదని పేర్కొన్నారు. తమకు ఆరు నెలలుగా కాస్మెటిక్ చార్జీలు రావడం లేదని తెలిపారు. దీంతో పాటు రోడ్డు పక్కన ఉన్న ఈ వసతి గృహానికి ప్రహరీ గోడ లేక తమకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ గిరిజన బాలిక వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను ఐటీడీఏ.ఉన్నతాధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని యెడల తమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సక్కు, ఆత్రం నగేష్, రఘు, రవి పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్‌ల వద్ద బారులు తీరిన వాహనదారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హిట్ అండ్ రూల్స్ నిబంధనలను వ్యతిరేకిస్తూ, ఈనెల ఐదు నుంచి భారీ వాహనాల ఆందోళన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ దొరకదు అంటూ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పెట్రోల్ బంకులు రద్దీగా మారాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు తమ బైక్స్, కార్లలో ఫుల్ ట్యాంక్ చేయిస్తున్నారు. హిట్ అండ్ రన్ కేసులో ప్రస్తుతం ఉన్న శిక్షను, జరిమానాను భారీగా పెంచడంతో ఈ నిరసనలకు కారణమైంది. ఈ ట్రక్కు డ్రైవర్లు ఆందోళన చేస్తుండటంతో సరఫరాలో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే ట్రక్కులు కూడా నిలిచిపోవడంతో ఎక్కడ ఇంధన కొరత ఏర్పడుతుందనని వాహనదారులు భయపడుతున్నారు. ఈ క్రమంలోనే పెట్రోల్ బంకుల ముందు క్యూ కడుతున్నారు. దీంతో పెట్రోల్ బంక్‌ల వద్ద భారీగా ట్రాఫిక్ ఏర్పడుతోంది. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో ఉన్న పెట్రోల్ బంకులకు వాహనదారులు క్యూ కట్టారు. దీంతో కొంత ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. రెండు మూడు రోజులపాటు పెట్రోల్ బంక్‌లు బంద్ ఉంటాయన్న సోషల్ మీడియా ప్రచారంతో ట్యాంక్‌లు ఫుల్ చేసుకుంటున్నారు. పెట్రోల్ యజమానులను వివరణ కోరగా బంద్ లాంటిది ఏమి లేదని పెట్రోల్ డిజిల్ అందుబాటులో ఉంటుందని ఎలాంటి ఆందోళన చెందవద్దని తెలిపారు.

**ఏదైనా ఉంటే ముందస్తు సమాచారం ఇవ్వాలి..**

ఈ విషయమై పలువురు వాహనదారులు మాట్లాడుతూ ఏదైనా ఆందోళ కార్యక్రమాలు ఉంటే ముందస్తుగా సమాచారం ఇవ్వాలని ఇలా అకస్మాత్తుగా నిర్ణయం తీసుకుంటే ఎలా అని ప్రశ్నించారు. కొందరికి ఈ విషయం కూడా తెలువదని అన్నారు. గంటల తరబడి లైన్‌లలో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పెట్రోల్ నిత్యావసరమని అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఎలా అని ప్రశ్నించారు.

## రిమ్స్‌లో ఖాళీల భర్తీతో పాటు సౌకర్యాలు కల్పించేల కృషి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

రిమ్స్ నుంచి ఏ ఒక్క రోగి కూడా రేఫర్ కాకుండా పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఖాళీల భర్తీతో పాటు సౌకర్యాలు కల్పించేల ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. మంగళవారం రిమ్స్ కళాశాలలోని సమావేశ మందిరంలో రిమ్స్ అందిస్తున్న సేవలు, సౌకర్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రిమ్స్‌కు వచ్చిన ఎమ్మెల్యేకు ముందుగా డైరెక్టర్ డా.జైసింగ్ రాథోడ్, వైద్యులు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. అనంతరం రిమ్స్ అందిస్తున్న సేవలు, ఖాళీల వివరాలు, సౌకర్యాలను డైరెక్టర్ ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం రిమ్స్‌లో పని చేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డులకు పీఎఫ్, ఈఎస్ఐ కోత విధిస్తున్న వాటి వివరాలు ఇవ్వడం లేదని కార్మికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. పీఎఫ్ డబ్బులు వారం రోజుల్లో రాని పక్షంలో సంబంధిత కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని డైరెక్టర్‌కు ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ వందల కోట్లతో రిమ్స్ అస్పత్రి నిర్మాణం అయిందన్నారు. సరైన వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయని, కొన్ని జిల్లా స్థాయిలో ఉన్నాయని కలెక్టర్‌తో మాట్లాడి వాటిని పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో మరిన్ని సమస్యలున్నాయని వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ వైద్యులు ఇద్రిస్‌అక్బానీ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే, అధికారులను కలిసిన జర్నలిస్టుల జేఏసీ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జర్నలిస్టుల జేఏసీ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా అధికారులను ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం జేఏసీ కన్వీనర్ నూకల దేవేందర్ ఆధ్వర్యంలో ముందుగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కాసేపు జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్‌తో వివరించగా సానుకూలంగా స్పందించారు. అనంతరం జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను వేర్వేరుగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే నియోజకవర్గ ఎమ్మెల్యే పాయల శంకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి (డీపీఆర్వో) విష్ణువర్ధన్‌ను ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కోకన్వీనర్ బీర్కుర్‌వార్ వెంకటేష్, జర్నలిస్టులు లెనిన్, రఘునాథ్, మెడపట్ల సురేష్, ఫెరోజ్ ఖాన్, సుభాష్, రాము, మొయిస్, దత్తాత్రి, నర్సింగ్, కిరణ్‌రెడ్డి, అరుణ్ రెడ్డి, గాజరి శ్రీకాంత్, అస్మత్, నీలేష్, అనిల్, మహేందర్, ప్రవీణ్ ఉన్నారు.

## 4న కబడ్డీ జట్లఎంపిక పోటీలు

నవతెలంగాణ-ముథోల్

నిర్మల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన గురువారం ముథోల్‌లోని రబింద్రాహై స్కూల్ లో జూనియర్స్ బాలబాలికల జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్టు ఆ సోసియేషన్ గౌరవ అధ్యక్షుడు భూపతిరెడ్డి, సెక్రెటరీ బి.సునీల్ ఆర్గనైజింగ్ ఎస్.ప్రేమలతలు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన జిల్లా జట్టు ఈ నెల 11 నుండి14 వరకు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని 49వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ముథోల్‌లో జరిపే జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2004 ఫిబ్రవరి తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. అబ్బాయిలు 70 కేజీలు అమ్మాయిలు 65 కేజీల బరువు ఉండి ఆధార్ కార్డు, రూ.100 రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకొని ముథోల్‌లో పీఈటీ నవీన్ కు ఉదయం 9 గంటలకు రిపోర్ట్ చేయగలరని నిర్వాహకులు తెలిపారు. ఎంపిక పోటీలలో పాల్గొనే క్రీడాకారులు రబింద్రా హై స్కూల్ పాఠశాల పీఈటీ రామకృష్ణ 8096044114, పీఈటీ శ్రీకాంత్ 7731064952 నెంబర్లకు రిపోర్ట్ చేయలని కోరారు.

## ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించిన జడ్పీటీసీ



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంతో పాటు సుంకిడి, కొత్తూరు, కప్పర్‌దేవి గ్రామాల్లో కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామసభల్లో జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ప్రత్యేక అధికారి మహవీర్‌తో కలిసి మంగళవారం దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన లబ్దిదారులు వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, సర్పంచ్లు కళ్లెం కరుణాకర్‌రెడ్డి, మహేందర్ యాదవ్, ఎంపీడీఓ రమాకాంత్, తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంఈఓ నారాయణ, ఎంపీఓ దిలీప్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ బాబన్న, ఎంపీటీసీ చంటి, గౌరమ్మ వెంకన్న, కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ రావు, విలాస్ యాదవ్, సుభాష్, గణేష్, నారాయణ పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని గుంజాల, ఖంపూర్ గ్రామ పంచాయతీల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని సర్పంచులు సావిత్రి బాయి, సలాం ఆనంద్ రావ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్య సాధనలో ప్రజలే ప్రచారకర్తలని అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకం లబ్ది పొందకుండా మిగిలిపోకూడదనే గొప్ప లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారని పేర్కొన్నారు. అధికారులతో కలిసి ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ వాహనాన్ని పరిశీలించారు. కార్యక్రమం హెల్త్ సూపర్ వైజర్ చౌహన్ చరణ్‌దాస్, హిమ బిందు, కార్యదర్శి శ్రీనివాస్, విజయ్ ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## శ్రీరాములోరి అక్షింతల శోభయాత్ర

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని చించాల, తరోడా గ్రామాల్లో మంగళవారం అయోధ్య అక్షింతల వితరణ సందర్భంగా తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అక్షింతల కలశాలతో శ్రీ రాములోరి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆయా విధుల్లో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, మహిళలు మంగళ ఆరతులతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ఎడ్‌బిడ్, ఎడ్‌బిడ్ తండ ఆష్టా, బ్రహ్మన్‌గాం, గ్రామంలో లబ్దిదారుల నుంచి మంగళవారం ప్రజాపాలన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల కోసం ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాల గురించి తహసీల్దార్ ఎండీ అతికొద్దిన్, ఎంపీడీఓ సురేష్ బాబు చదివి వినిపించారు. దరఖాస్తుల స్వీకరణను మండల ప్రత్యేక అధికారి సుదర్శన్ పరిశీలించారు. అదేవి ధంగా జనవరి 6వ తేదీ వరకు ప్రత్యేక కౌంటర్లలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, తహసీల్దార్ అతికొద్దిన్, ఏపీఓ శిరీషారెడ్డి, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శిలు, ఐకేపీ సీసీలు, ఏఈఓలు, ఆర్ఐ నారాయణ, ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ సిబ్బంది నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పటిష్టమైన చర్యలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పాయల శంకర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్, ట్రాఫిక్ సమస్యలపై ట్రాఫిక్ ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులతో కలిసి మార్కెట్‌దారులతో కాలినడకన పర్యటించారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులైన గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్, కిసాన్‌చౌక్‌ల గుండా తిరుగుతూ పరిస్థితిని సమీక్షించారు. వాహన రాకపోకలకు కలుగుతున్న అంతరాయాన్ని మున్సిపల్ అధికారులకు స్వయంగా వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రస్తుత మున్సిపల్ పాలక పక్షం చేసిన అనాలోచిత చర్యల వల్ల పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.